శివరాంపల్లి ప్రజాభవన్‌లో జిల్లాస్థాయి పోటీలు



మాట్లాడుతున్న సందీప్ తోట

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రజాభవన్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగులయ్య, జనరల్ సెక్రటరీ సలోమి స్నేహలత ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎలక్యూషన్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈఎల్‌టీఏ రిటైర్డ్ టీచర్ ఫౌండర్ నని కొము రయ్య, మోటివేషనల్ స్పీకర్, న్యూరో లాంగ్వేజిక్ ప్రోగ్రామర్ సందీప్ తోట, జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి హెడ్‌మాస్టర్ కిషన్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు పెంపొందించడంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన పాత్ర పోషిస్తున్నదన్నారు. 27 మండలాల నుంచి ఇంగ్లీష్ ఒలింపియాడ్, స్పీచ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వారు ప్రశంసించారు. స్పీచ్ పోటీల్లో అక్షిత టీఎస్ఎంఎస్ చేవెళ్ల ప్రథమ బహుమతి, ఇంగ్లీష్ ఒలింపియాడ్ కాంపిటేషన్‌లో జి.రుద్రాక్ష సరూర్‌నగర్ మొదటి బహుమతి పొందారు. అలంకృతి టీజీఎంఎస్ ఇబ్రహీంపట్నం మొదటి, జడ్పీహెచ్ఎ ఎంపీ పటేల్ ఇబ్రహీంపట్నం మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో ఎన్ఎల్పీ ట్రైనర్ సందీప్ తోట, ఉపాధ్యాయులు హనుమంత రావు, ఎస్ఎంసీ చైర్మన్ పి.శ్రీధర్ రెడ్డి, సుదర్శన్, కృష్ణయ్య, గోపాల్, నరసింహ, సుదర్శన్, లక్ష్మణ్, వీరప్ప, మహమూద్, సోలోమన్, రజిని, అనురాధ, స్వప్న, మంజుల పాల్గొన్నారు.

24న కవి సమ్మేళనం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న 'చేనేత కళా వెలుగులు' అనే అంశంపై రవీంద్రభారతిలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు విద్యావేత్త, నిర్వాహకులు సూరెపల్లి రవికుమార్ తెలిపారు. చేనేత కళకు కవిత్వం ద్వారా మరింత ప్రాధాన్యత ఇచ్చేందుకు కవుల సృజనాత్మకతకు వేదికగా ఈ సమ్మేళనం నిలుస్తుందన్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం ఒంటి గంటకు రవీంద్రభారతిలో నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనేవారు ఇతర వివరాలకు 63037 32862లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- కాచారంలో గ్రామసభకు హాజరు



కాచారం గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కాచారంలో ప్రజాపాలనలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల విషయమై ఎవరూ ఆందోళన చెందవద్దని..ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అలాగే అర్జీలు చేసుకోనివారు ఉంటే కొత్తగా మళ్లీ దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కొత్త కార్డులతో పాటు పేర్ల మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకే మూడు రోజుల పాటు పంచాయతీలు, మున్సిపాలిటీలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హుల జాబితాను ఈ సభల్లోనే ప్రదర్శిస్తామని, వీటిపై సందేహాలు, అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని పేర్కొన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. భూమిలేని పేదలు జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి 20 రోజులు పని చేస్తే ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉన్నవారు, స్థలం లేని వారి జాబితాను వేర్వేరుగా ప్రకటిస్తామన్నారు. అలాగే గ్రామంలో ఆయా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను ప్రకటించారు. ఇన్‌స్పెక్టర్ కే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీఓ మున్నీ, ఎంపీఓ ఉషా, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బండ్లగూడ, జహంగీరాబాద్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆలీనగర ఆయూషా కాలనీ, అహ్మద్‌నగర్, ప్లేస్ వ్యూ కాలనీ, కింగ్స్ అవెన్యూ, జహంగీరాబాద్, మిలత్‌నగరథ్, వాదే ఈ ఫర్హాన్, క్రిస్టల్ టౌన్, రహమత్‌నగర్, అబ్దుల్లా కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్రిస్టల్ టౌన్, మొగల్ కాలేజ్, రహమత్ కాలనీ, రాయల్ సీ హోటల్, వాదే ఈ ఫర్హాన్, సుబాన్ హిల్స్, అబ్దుల్లా కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, పటేల్‌నగర్, రహమత్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు నార్సింగిలో రోడ్ సేఫ్టీ ర్యాలీ

మణికొండ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నార్సింగి ప్రభుత్వోన్నత పాఠశాలలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను స్కిట్ రూపంలో వివరిస్తారని పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల పరిశీలనను వేగవంతం చేయాలని చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న సూచించారు. సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, ఇతర అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో సమయానికి ముందే దరఖాస్తుదారుల పరిశీలనను పూర్తి చేయాలన్నారు.

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు

వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్


మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బురానుద్దీన్

మొయినాబాద్: రాజకీయ ప్రముఖులతో దిగిన ఫొటోలు చూపిస్తూ..సీబీఐ, ఈడీ, ఏసీబీలో పెండింగ్ కేసులను సెటిల్ చేయిస్తానని.. కాంట్రాక్టులు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మొయినాబాద్ మండలం తోలుకట్ట రెవెన్యూలోని సర్వే నంబర్ 144లో 6 ఎకరాల భూమి విషయంలో షాహెదాబేగం, రషీద్ మధ్య వివాదం కొనసాగుతోంది. రషీద్ తరఫున బంజారాహిల్స్‌కు చెందిన సయ్యద్ బురానుద్దీన్ అలియాస్ బురాన్ 2023 మే 9న తన అనుచరులతో తోలుకట్టలోని భూమి వద్దకు వచ్చి చాకులు, తల్వార్లతో హల్‌చల్ చేసి అడ్డువచ్చిన వారిపై దాడి చేసి గాయపర్చారు. దీంతో అప్పట్లో బురానుద్దీన్‌తోపాటు అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదైంది. తనను అరెస్టు చేయకుండా బురానుద్దీన్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాడు. అయితే పోలీసులు ఇటీవల స్టే వెకేట్ చేయించారు.

మూడు నెలలుగా గాలింపు..

బురానుద్దీన్‌తో పాటు నిందితులైన మరో 8 మందిని పట్టుకునేందుకు ఎస్ఓటీ, మొయినాబాద్ పోలీసులు 3 నెలలుగా గాలిస్తున్నా దొరకలేదు. సోమవారం రాత్రి హైదర్షాకోట్ ఫ్లాట్‌లో ఉండగా పట్టుకుని బెంజ్ కారును స్వాధీనం చేసుకున్నారు.

12 కేసుల్లో నిందితుడు..

బురానుద్దీన్ అలియాస్ బురాన్, ఓపీ సింగ్ అలియాస్ ఓపిల్ శర్మ పేర్లతో చాలామంది రాజకీయ ప్రముఖులతో ఫొటోలు దిగాడు. వారంతా తనకు చాలా దగ్గరని సీబీఐ, ఈడీ, ఏసీబీ ఇన్వెస్టిగేషన్ సంస్థల్లో పెండింగ్ కేసులను మాఫీ చేయిస్తానని.. కాంట్రాక్టులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడ్డాడు. ఇతనిపై జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్లలో 4 కేసులు, సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, మైలార్‌దేవ్‌పల్లి, నార్సింగి, శంషాబాద్, రాజేంద్రనగర్, పోలీస్‌స్టేషన్లలో మొత్తం 12 కేసులు నమోదయ్యాయి. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా జోనల్ అధికారి భీమయ్య మంగళవారం తెలిపారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను వెబ్‌సైట్ https://tscet.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలని, దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు నంబర్, బర్త్ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటో జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కథా రచయిత్రులకు ఉచిత శిక్షణ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ సహకారంతో రసరంజని, సరసిజ (థియేటర్ ఫర్ ఉమెన్) హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో 'నాటకం రాయడం ఎలా' అనే అంశంపై కథా రచయిత్రులకు ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం మూడు రోజుల పాటు కొనసాగుతుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డీ.ఎస్.ఎన్.మూర్తి, విజయ భాస్కర్ హాజరై ప్రసంగించారు. నాటకాన్ని రాసే విధానాన్ని విశదీకరించారు. పలు మెలుకువలు నేర్పించారు. అత్తలూరి విజయలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు.

మహిళా శక్తి క్యాంటీన్‌లో అక్రమాలు

మాజీ మంత్రికి నార్సింగివాసుల ఫిర్యాదు


సబితారెడ్డికి ఫిర్యాదు చేసిన నార్సింగి బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: నార్సింగిలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో అక్రమాలు జరిగాయని పలువురు నార్సింగివాసులు మాజీ మంత్రి పి.సబితారెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగురు డ్వాక్రా సంఘం మహిళలు ఉపాధి పొందేందుకు గత నెలలో క్యాంటీన్‌ను ప్రారంభించారన్నారు. అయితే అంతలోనే దానిని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీలో ఉద్యోగిగా పనిచేస్తున్న నాగలక్ష్మి, మంచిరేవులకు చెందిన జ్యోతి అనే మహిళల నియమించుకుని కొనసాగిస్తున్నదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, తమకు సహకరించాలని మాజీ మంత్రిని కోరారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు ప్రియదిర్శని, ఉపాధ్యక్షురాలు జయమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఫారూఖీ, నాయకులు జితేందర్, శేఖర్‌గౌడ్, సుశీల్‌కుమార్, మహేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నరేందర్


నియామక పత్రం అందిస్తున్న మాజీమంత్రి సబితారెడ్డి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా పుప్పాలగూడకు చెందిన గుట్టమీది నరేందర్‌ను నియమించారు. ఈ మేరకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి మంగళవారం నరేందర్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం పాటుపడిన ప్రతి నాయకుడికి గుర్తింపు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేక చతికిల పడిందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు మాల్యాద్రినాయుడు, విజయలక్ష్మి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీధర్, షేక్ ఆరీఫ్, రామసుబ్బారెడ్డి, దిలిప్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


అఖిల

శంషాబాద్ రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కే నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతూప్ర గ్రామానికి చెందిన తెలగమల్ల అఖిల (36) ఈనెల 20న కిరాణ దుకాణానికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. వారం క్రితం భర్త యాదగిరితో గొడవ పడగా.. పెద్దలు సర్దిచెప్పారు. ఈ క్రమంలోనే ఆమె ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం


మల్లన్నను దర్శించుకుంటున్న జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కేంద్రంలో ఈనెల 18న ప్రారంభమైన మల్లన్న ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు ఆలయ కమిటీ నిర్వాహకుడు, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. ప్రసన్న అశోక్‌యాదవ్ దంపతులు అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం 8 గంటలకు తొట్టెలు, గంపలతో ఆలయానికి చేరుకోగా 11.30 నుంచి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేపట్టారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కే వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓంప్రకాశ్‌రెడ్డి, కోకాపేట కౌన్సిలర్ దుర్గేశ్‌యాదవ్, నాయకులు కిరణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, గోపాల గణేశ్, రాము, వినోద్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


తొట్టెలు, గంపలతో ఆలయానికి వస్తున్న అశోక్‌యాదవ్, గ్రామస్తులు

మనూలో అంతర్జాతీయ సదస్సు


ప్రొ.బిద్యుత్‌చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి ప్రయత్నాలకు మేధస్సు కేంద్ర బిందువు అని కోల్‌కతా విశ్వభారతి సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బిద్యుత్‌చక్రవర్తి అభిప్రాయపడ్డారు .గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'మెరుగైన ప్రపంచం కోసం సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్:రోల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరత, మానవ మేధస్సు ప్రాథమిక సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. 'మనూ' ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షగుఫ్తా షాహిన్ మాట్లాడుతూ ఆచరణాత్మక అంశాలను దృష్టిలో ఉంచుకుంటే స్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికకు వార్డు, గ్రామ సభలు

హాజరైన అధికారులు, ప్రజలు


పెద్దతూప్రతండాలో నిర్వహిస్తున్న గ్రామసభ

మణికొండ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు మంగళవారం వార్డు, గ్రామ సభలను నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పంచవటి కమ్యూనిటీహాల్‌లో 1,2,3,4,14 వార్డు సభల్లో మణికొండ మున్సిపల్ చైర్మన్ కే నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 3,4,7,16,10,15,18, మిర్జాగూడ గ్రామాల్లోని సభల్లో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం నాగపూర్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అర్హులందరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కమిషనర్లు డీ ప్రదీప్‌కుమార్, టీ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేశ్, వైస్ చైర్మన్లు కే నరేందర్‌రెడ్డి, జీ విజయ్‌బాబు, మాజీ వైస్ చైర్మన్ జీ వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్లు జీ అరుణజ్యోతి, ఎల్.వందననగేశ్, యాలాల లావణ్యనరేశ్, పద్మవీరారెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్, హిమాయత్‌సాగర్‌లో..

బండ్లగూడ: కిస్మత్‌పూర్ యూపీహెచ్‌సీ, హిమాయత్‌సాగర్ ఎంపీపీఎస్‌లలో సభలు నిర్వహించి ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రజలకు చదివి వినిపించారు. అలాగే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, దరఖాస్తుదారుల జాబితాను ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా జాబితాలో పేర్లు లేని వారి నుంచి నూతన రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ మంజూరు కోసం అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్, కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు రాము, అస్లాం, నిఖిలరెడ్డి, ప్రశాంత్, కోఆప్షన్ సభ్యుడు మలాకీ రత్నం, గండిపేట తహసీల్దార్, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

శంషాబాద్ మండలంలో..

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్, చౌదరిగూడ, పెద్దతూప్రతండా, కాచారంలో నిర్వహించిన సభల్లో సంక్షేమ పథకాల అర్హుల జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మ ప్రజలు పాల్గొన్నారు.

ఒకటో వార్డులో..

శంషాబాద్: పట్టణంలోని ఒకటో వార్డులో నిర్వహించిన సభలో ఆ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాచమల్ల గీతాసిద్దేశ్వర్ పాల్గొన్నారు. జాబితాలో వచ్చిన వారికి మాత్రమే కాకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే పలువురు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులకు అర్జీలు అందజేశారు.


మణికొండ పంచవటి కాలనీ సభలో మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

సాతంరాయిలో ప్రజాగ్రహం..

పట్టణంలోని సాతంరాయిలోని రెండో వార్డులో నిర్వహించిన సభలో రేషన్ కార్డుల జాబితాలో పేర్లు లేకపోవడంతో పలువురు అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితా తప్పుల తడకగా ఉందని అర్హుల పేర్లు ఎందుకు లేవని అధికారులను నిలదీశారు. దీంతో కొందరులు అధికారులు స్థానికులకు సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు.


మంచిరేవుల సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్


జాబితా వివరాలు చదివి వినిపిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర


ఒకటో వార్డులో మాట్లాడుతున్న కౌన్సిలర్ రాచమల్ల గీత

లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల ధర్నా

- చిత్తాపూర్– సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ఆలస్యంపై ఆగ్రహం
- 9 మందిపై కేసు నమోదు


లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

శేరిలింగంపల్లి: ప్రతి రోజూ రైలు ప్రయాణంలో ప్రతి రోజూ జాప్యం జరుగుతుండటంతో అసంతృప్తికి లోనైన రైల్వే ప్రయాణికులు లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు సమీపంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రయాణికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తాపూర్– సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ప్రతి రోజూ రెండు గంటల ఆలస్యంగా వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లింగంపల్లి స్టేషన్‌కు 7.35 నిమిషాలకు రావాల్సిన రైలు 8.35 నిమిషాలకు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ హోమ్ సిగ్నల్ వద్ద రైలు నిలపగానే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో కిందకు దిగి నిరసనకు చేపట్టారు. చిత్తాపూర్– సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ప్రయాణంలో జాప్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రైల్వే అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు, రైల్వే అధికారుల వారికి నచ్చ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

పలువురిపై కేసులు నమోదు

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చిత్తాపూర్-సికింద్రాబాద్ ప్యాసింజర్‌ను అడ్డుకున్నందుకు గాను ఆర్‌పీఎఫ్ పోలీసులు 9 మందిపై కేసులు నమోదు చేశారు. వారు ఏం జరుగుతుందోనని అక్కడికి వెళ్తే తమపై కేసులు పెట్టారని ప్రయాణికుల బంధువులు అసహనం వ్యక్తం చేశారు.

రైళ్ల రాకపోకల్లో ఆలస్యం..

ప్రయాణికుల ఆందోళన కారణంగా లింగంపల్లి స్టేషన్ మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. దీంతో ఎంఎంటీఎస్ రైళ్లు, బీదర్ ఇంటర్ సిటీ, పూర్ణ ప్యాసింజర్, వికారాబాద్ ప్యాసింజర్ తదితర రైళ్ల రాకపోకల్లో జాప్యంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రేపు 'వికసిత్ భారత్-2047' సమావేశం

రాయదుర్గం: యూనివర్సిటీలోని మహిళా హౌజ్ కీపింగ్, ఇతర సిబ్బందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి మనూలో 'వీక్షిత్ భారత్- 2047' కోసం సామాజిక చేరిక' పేరిట ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ఎస్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ డానిష్‌మోయిన్ మంగళవారం తెలిపారు. 'మనూ'లోని అల్-బెరూని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆయా కార్యక్రమాలను యూజీసీ సూచన మేరకు ఏర్పాటు చేసినట్లు వివరించారు.